భవానీ శంకర శతకము

Sl. No. 487

13448

శ్రీరస్తు.

శ్రీ

భవానీశంకర శతకము

గ్రంథకర్త
మాదిరాజు రఘునాథ

గుంటూరు

1940

శ్రీరస్తు.

శ్రీ

భవానీశంకర శతకము

గ్రంథకర్త

మాదిరాజు రఘునాధరావు

గుంటూరు

1940

విజ్ఞప్తి

నేనిదివరలో నీశతకమును నీతిభక్తి భరితంబుగ రచించి నాకు గల్గిన గృహబాధలవలన డెందంబు చింతలంబొరలుచుంటచే వెల్లడింపఁ జాలనైతి. లోకంబున మానవులొనరించు ప్రతికార్యంబులును దైవ సహాయములేనిది నెఱవేఱజాలవు. కావున నాశంకరుఁడు నేటికిఁ దన యనుగ్రహంబుఁ జూపించుటవలన దీనినిం బ్రకటింపఁగలిగితిని. ఇందెచ్చటనైన లోపంబులుండిన చదువరులు సుహృద్భావంబున మన్నించి క్షీరనీరంబుల వేఱుపఱచి క్షీరంబులఁ గ్రోలి నీరంబులవిడచు రాజహంసంబుపగిది సరసభావంబుల గ్రహించి యపశబ్దంబుల ద్రోసివేయఁ గలందులకుఁ బ్రార్థించుచున్నాడను.

ఈగ్రంథమును పరిశీలించి తమసదభిప్రాయమొసంగిన స్కూళ్ల డిప్యూటి ఇన్స్పెక్టరుగారయిన శ్రీ జి. వి. రామమూర్తి, బి. యె., యల్. టి. గారికిని, శ్రీమాన్ ఉభయభాషాప్రవీణ, శతావధాని రత్నాకరం అనంతాచార్యులవారికిని నాకృతజ్ఞతాపూర్వక వందనము లర్పించుచున్నాడను.

ఇట్లు,

మాదిరాజు రఘునాధరావు.

మ. రా. రా. శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తిగారు తమ యభిప్రాయము నిట్లొసంగిరి.

ధ్యానమనననిదిధ్యాసనములు కలసి మనుష్యహృదయమున భావలహరీపూరితమైన త్రివేణిని సృష్టించును. నిర్మలనీతిప్రబోధమునకు సుదారాశయారాధనము తోడై యీశ్వరసంస్తవమునకు సహకారియైనపుడు మానవజీవితమున సౌందర్యప్రదీప్తమైన ప్రయాగ తలసూపును. ఇట్లని యెఱిగియే ప్రాచీనవిజ్ఞానులు పూర్వోక్తాంశములకు తమ విద్యావిధానమున నుత్కృష్టస్థానము నొసఁగిరి; తమ గురుకులములందు గురుగుణజ్యోతిర్లీలను వెలయింపఁజేసిరి.

ప్రస్తుతవిద్యావిధానమున పూర్వోల్లిఖితాంశములు గగనకుసుమములై యున్నవి. పారమార్థికచింతకును, ఆధ్యాత్మికవిభూతికిని, అది దూరస్థమైనది. కావున నది దోషభూయిష్ఠమైనది. విశ్వకళాపరిషత్తులందు నుపాధ్యాయపదవుల నలంకరించినవారై పలుమాఱీవిషయమును ముక్తకంఠములతో వ్యక్తీకరించిరి. నిర్దుష్టమైనప్రబోధము నిర్మలనీతిబోధకు సహాయకారి. అధునాతనవిద్యావిధానమందలి దోసఁగులను మాపొనరించునది యేతాదృశబోధనమనియు, నీశ్వరోపాసనమనియు పండితులు గ్రహింపగలరు.

ఈ గ్రంథము మా నెరసులను మాపొనరింపగలదు. భవానీశంకర సంస్తవమందును, ఆధ్యాత్మికజీవితవిధానమందును, సౌందర్యోపాసనమందును, ఆనందవ్రతమందును విద్యార్థులను బద్ధదీక్షితులఁ జేయగలదు. ఈరీతిగ్రంథములను రచించుటయందు వీరు సిద్ధ

హాస్తులని వీరి "కాళహస్తీశ్వరశతక" మీవటిలో నాంధ్రవసుంధరకు దెలిపినది. అందలి పద్యములవలె నిందలి పద్యములుకూడ గంభీరభావబంధురములై, మంజులపదసంభరితములై యున్నవి. ఈపంక్తులను పరిశీలింపుడు.

... ... సత్యమే

యిడుమల్లలొగ్గనగాని వీడవలెదెందేనిన్ మహాకీర్తి నిం
డెడు దిక్కృణుల నిట్లొనర్చిన భవానీశంకరా ! సత్ప్రభూ !

ఈ గ్రంథమున నందందు భర్తృహరిపంక్తులకు ఛాయలనదగు వాక్యములుకలవు చూడుడు :

"శశశృంగంబు ప్రయత్నమున్ సలిపి వేసాధింపవచ్చుం జతు
ర్దిశలంగీర్తిఘటిల్లఁ దా నిసుమునంవేయంగనాఁ దైలమున్. "

జిజ్ఞాసువులును భక్తవరేణ్యులును గ్రంథప్రశస్తిని గమనింపగలరనుట నిస్సంశయము.

ఇయ్యది విద్యార్థులకు నత్యంతోపయోగము. స్కూళ్లయందు దీనిని పాఠ్యపుస్తకముగా నుంతురని నాయాశయము.

కమలావిలాస్ మైలాపూర్, మద్రాసు.	జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి, 17-11-1940.

పండితాభిప్రాయములు

I

ఈగ్రంథకర్తను స్వయముగా నేనెఱుగనుగాని, వీరు రచియించిన శ్రీ కాళహస్తీశ్వర శతకమును ఈ భవానీశంకరశతకమును చాలభాగముచూచితిని. మొత్తముమీద శైలిమృదులమై మధురముగను, ధారాళముగను ఉన్నది. వీరిపరిశ్రమము వీరిని క్రమముగా ప్రౌఢకవులలో చేర్పగలదని నానమ్మకము. వీరిగ్రంథములు విద్యార్థుల కుపకరింపగలవు.

ఈ కవి ఇట్టిగ్రంథము లింకను రచించి, తమయాశయమును నెరవేర్చుకొనుచు భాషాసేవ చేయగల్గుదురుగాక !

బాపట్ల,
7-11-1940.

జి. వి. రామమూర్తి, బి. ఎ., యల్. టి.
స్కూళ్ల డిప్యూటి ఇన్స్పెక్టరు (రిటైర్డు)

II

ఈశతకము మాదిరాజు రఘునాథరావు గారిచే రచింపఁబడినది. వీ రిదివరలో కాళహస్తీశ్వర శతకమును మఱికొన్ని గ్రంథములనుకూడ రచించియున్నారు. ఈశతక మచ్చటచ్చట స్థాలీపులాకన్యాయమున పరికించితిని. కొన్నిచోట్ల నీతివాక్యమయంబులగుపద్యంబులును, మఱికొన్నిచోట్ల భక్తిరసప్రతిపాద్యంబులగుపద్యంబులును విరాజిల్లుచున్నవి.

ఇయ్యది సుమతి, దాశరథి, నరసింహాది శతకములకైవడి నెలిమెంటరీస్కూళ్ళలో విద్యార్థుల కత్యంతోపయుక్తముగ నుండునని నాయభిప్రాయము. కావున విద్యాశాఖాధికారులుకూడ దీనిని స్కూళ్లలోని బాలురకుఁ బఠనార్హంబుగ నియమింపగలరని తలంచుచున్నాను.

రత్నాకరం అనంతాచార్యులు,
ఉభయభాషాప్రవీణ - శతావధాని,
హిందూకాలేజీ హైస్కూల్, గుంటూరు,

శ్రీరస్తు.

శ్రీ భవానీశంకర శతకము

శా. శ్రీగౌరీహృదయాబ్జభాస్కరుఁడవై చెన్నొందు భాగీరథిన్
రాగాంకూరములుప్పతిల్లఁ దలపై నందాల్చి మోదంబునన్
వాగీశాదుల సన్నుతుల్గొను నినున్ వర్ణింప నాకెట్లగున్
శ్రీగానప్రియ ! యబ్బరాట్పుర భవానీశంకరా ! సత్ప్రభూ. 1

మ. పరమాత్మున్ నినుఁగొల్చుచున్ మదిబహూపాయంబులంగార్యముల్
నరుఁ డెవ్వాఁ డొనరించునాతఁడెపుడైనంగాని దక్షుండునాఁ
బరగుంగూర్మిఁ పరోపకారమెవఁడున్ పాటింపఁడో వాఁడు దు
ర్నిరయంబుల్ గని కుందు నేమొడ భవానీశంకరా ! సత్ప్రభూ. 2

మ. ఘనభక్తిన్ నిను నేయెడంగొలుచు మార్కండేయుఁ జేబట్టి యా
వనజాతాప్తజుఁ బాఱదోలితివి నీ వాత్సల్య మేమందు ని
న్ను నెదంగొల్చెడివారి కేకొఱతలుండున్! నన్నుఁ బాలింపు మే
నిను వీడంగలవాఁడనోదునె? భవానీశంకరా! సత్ప్రభూ. 3

శా. నీచారిత్రము గాథ ఘోరకలుషానీకంబుఖండించునా
నీచిద్రూపము చూచువారికి శుభానీకంబులంగూర్చునా
నీచింతామయ వర్షమామయదవాగ్నింబట్టి చల్లార్చు నీ
నీచిత్రంబుల నెన్న శక్యమె? భవానీశంకరా ! సత్ప్రభూ. 4

శా. సంపాదించిధనంబు బొక్కసమునన్ సంధించుకాలంబునన్
కొంపంజొచ్చి భుజించు చుట్టములు సభ్యుల్ తద్ధనంబెల్ల క్షీ
ణింపం జూచియు మాటలాడరెపుడేనింగాని; నీమాయ వ
ర్ణింపన్ శక్యమె? తండ్రి! యీశ్వర! భవానీశంకరా! సత్ప్రభూ. 5

మ. అవివేకంబున బాంధవాప్తసుత జాయాపుత్రికా మోహపా
శ వితానావృతచిత్తు లెప్పుడయినన్ సారత్వదీయాభిధా
న విచింతామృతపాన శూన్యులయి కానన్ లేక కైవల్య మి
న్ని విపర్యాసము లందుచుందురు భవానీశంకరా! సత్ప్రభూ. 6

మ. మనుజప్రాణములార్చు మృత్యువు జయింపంజాలి మృత్యుంజయుం
డను నామంబు వహించినట్టి భవదీయాస్తోకమాహాత్మ్యమున్
వినుతింపంగఁ దరంబె? నన్నిఁక వెసన్ నీసన్నిధానంబునన్
నెనరుంజూపి వసింపఁజేయుము భవానీశంకరా! సత్ప్రభూ. 7

మ. జనమాన్యోత్తమ సౌఖ్యసంపదల కుత్సాహంబె సత్కారణం
బనుచుం బెద్దలు చెప్పుచుందురదియున్ హైన్యంబుఁజెందంగ నే
పనులైనన్ సమకూడనేరవిలలో బ్రహ్మాదులైనన్ మదిన్
నినుఁజూడన్ బలవంతులౌదురె? భవానీశంకరా! సత్ప్రభూ. 8

మ. మనమందెంచి శివప్రతిష్ఠనొనరింపం గష్టముల్వచ్చి నా
శనముం జెందుదురంచు నెందరనినన్ స్వాంతంబునన్ దీక్షచే
వినకవ్వారలమాట భక్తిమతిసేవింపంగ యత్నించి నే
నినుఁజెల్వారఁ బ్రతిష్ఠసేసితి భవానీశంకరా! సత్ప్రభూ. 9

మ. జనమాన్యోత్తమ కీర్తిపౌరుష మహాజ్ఞానంబులం బేరుఁగాం
చిన ధర్మాత్ముని భాగ్యమల్పమయినన్ సేవ్యంబు; లేకెట్టులై
నను గర్భంబును నింపుకొంచు ధరలోనం గాకి జీవించుచుం
డిన నేకార్యము సంఘటిల్లునె? భవానీశంకరా! సత్ప్రభూ. 10

మ. నెఱిసేవాగత పాయసాన్నములకంటెన్ స్వేచ్ఛవాటిల్లు గం
జి రహింగూరుచుఁ; బాటెఱుంగనిదొరన్ సేవించుటంగంటె మం
దిరమం దూరకయుంట మేలు; కలవానింజూతు రే వేళలన్;
నిఱుపేదన్ భరియింపఁ డొక్కఁడు భవానీశంకరా! సత్ప్రభూ. 11

శా. ఔరా! స్నానమొనర్పకే నదుల, సంధ్యావందనాదిక్రియా
వారంబుల్ప్రచరింపకుండినను దేవా! నీపదధ్యాన మె
వ్వారల్సేయుదు రట్టివారలకె కైవల్యంబు ప్రాప్తించు; నా
నేరంబుల్ మదినుంచ కేలుము భవానీశంకరా! సత్ప్రభూ. 12

శా. మానంబుత్తమ భూషణంబు తలఁపన్ మర్త్యాళికిన్; నిర్మల
జ్ఞానంబా ఘనముక్తిదాయకము; విజ్ఞశ్రేణిశ్లాఘించు స
ద్దానంబేయెడ రాజువిద్యలకిలన్ ధర్మంబె సాహాయ్య మీ
నీనామస్మరణంబె పుణ్యము భవానీశంకరా! సత్ప్రభూ. 13

మ. అడియాసం గొలువాచరించినను సౌఖ్యంబారు; దుష్టాళితోఁ
గడునెయ్యంబొనరింప, లేనివెతలుం గల్గుంగదా; సత్యమే
యిడుమల్గల్గినఁ గాని వీడవల దెందేనిన్; మహాకీర్తి నిం
డెడు దిక్శ్రేణుల నిట్లొనర్చిన భవానీశంకరా! సత్ప్రభూ. 14

మ. జనుఁడత్యుత్తమ భక్తినైన విమలజ్ఞానంబుచేనైన లో
కనుతోదంచిత కీర్తికైన నిజభక్తశ్రేణి వాంఛాప్రదున్
వనజాతాసనవాసవాదిబుధసేవామోదితస్వాంతుని
నినుసేవింపక మోక్షమొందునె ? భవానీశంకరా ! సత్ప్రభూ. 15

శా. పారావారము దాటవచ్చు నగముల్ ప్రాకంగవచ్చున్ మహా
చారంబుల్ జరుపంగవచ్చు వ్రతముల్ సల్పంగవచ్చున్ మహా
ఘోరాగ్నిం దిగ్రమింగవచ్చును భవాకూపారముందాట నా
నీరేజాక్షునికైన శక్యమె ? భవానీశంకరా ! సత్ప్రభూ. 16

మ. ధనధాన్యంబులు వస్తువాహననిశాంతశ్రేణి రాజ్యంబు లుం
డిన భక్తప్రియు సత్కృపాజలధి వాణీనాయకేంద్రాదిదే
వనుతున్ నిన్ను నుతింపకేకరణిఁ గైవల్యంబు మర్త్యుండు పొం
దెనె? నన్నింతటనైనఁ గావుము భవానీశంకరా ! సత్ప్రభూ. 17

మ. శునకంబుం గొనివచ్చి వేడుకలతో శోభిల్లు సింహాసనం
బున నుంపంగ మృగేంద్రశౌర్య మెటులబ్బున్; నీచుఁడారీతిఁ దా
జనమాన్యాగ్రపదంబుఁ బొందినను నైజంబున్ మహింబాసి యీ
నినుఁజెందంగలవాఁడె? యీశ్వర! భవానీశంకరా! సత్ప్రభూ. 18

శా. నీవాజ్ఞామధురి నీ మహాగుణములున్ నీ భక్తవాత్సల్యమున్
నీవైశద్య మజాదినిర్జరులు వర్ణింపంగ లేరంచు నే
నేవేళన్నిని గొల్చుచుంటి నిను నాయీనేరముల్ సైచి యా
నీవాసంబున నింకఁ జేర్పుము భవానీశంకరా! సత్ప్రభూ. 19

మ. శశశృంగంబు ప్రయత్నమున్ సలిపివే సాధింపవచ్చుం జతు
ర్దిశలం గీర్తి ఘటిల్లఁ దా నిసుమునం దీయంగ నౌఁ దైలమున్
వశిన్మొ దేహిమనంబునందు నినుఁ గైవల్యప్రదుం దానహ
ర్నిశలుం గొల్చుచుఁ జూడ నేర్చునె? భవానీశంకరా! సత్ప్రభూ. 20

మ. పలుకష్టంబుల నీచఘోరతరసేవావృత్తిచేఁగల్గు ని
ర్మలమృష్టాన్నముకంటె స్వేచ్ఛవలనన్ రాణించునాచామ మే
వలనన్ మేలు; నెఱుంగు దీనినెవఁడున్ వాఁడొంది సత్కీర్తి నీ
నెలవుం జేరి సుఖించునేయెడ భవానీశంకరా! సత్ప్రభూ. 21

మ. ఘనతం బేడికి భార్యయుం; జెవిటికిన్ గానంబు; నేవేళఁ జీఁ
కునకున్ మంజులరూపదర్శనము; సంకోచంబుఁ గల్గించు రీ
తిని లో నీపదభక్తిహీనునకుఁ జింతింపంగ మోక్షంబిలన్
నెనరుం జూపుసుఖంబొసంగునె? భవానీశంకరా! సత్ప్రభూ. 22

మ. ఘనఘోరాంబుధు లీఁదఁగానగు నగౌఘుం బెత్తి చేఁబట్టి త్రి
ప్పనగున్ గ్రూరవిషంబు మ్రింగనగు భూభాగంబు సర్వంబు మో
యనగుం గాని ధరిత్రి భక్తిరహితుండాత్మం గడున్ వేడ్కతో
నినుఁ జూడంగలవాఁడె? యీశ్వర! భవానీశంకరా! సత్ప్రభూ. 23

మ. అధికారంబు వహించియుంటినని గర్వాధిక్యతన్ వీడి స
త్పథమందేనరుఁడుండు నాతఁడె మహాభద్రంబులం జెందు స
ద్విధులన్ నిన్ను భజించుచుం దుదకుఁ బ్రీతిస్వాంతుఁడై సత్కృపా
నిధియౌ నీపదమందునుండడె ? భవానీశంకరా ! సత్ప్రభూ. 24

మ. జనముల్ చూచి నుతింపనీనిలయముల్ సంప్రీతిఁ గట్టించి న
ట్టి నరుల్ గష్టములందునుంచి కడుదండింపంగ న్యాయంబె ? మే
లొనరింపంగలవారి నిట్లణఁపనీ కుత్సాహమా ? ధర్మమా ?
నిను నేవీడ మఱెట్టులైనను భవానీశంకరా ! సత్ప్రభూ. 25

మ. కరణీయంబులు నీపదార్చనలెదన్ గౌతూహలంబొప్ప నా
దరణీయంబులు నీదుమంజులచరిత్రంబుల్ మహాభక్తి సం
స్మరణీయంబులు నీదుమంత్రజపముల్ సాధించి నీదివ్యమం
దిరసౌభాగ్యమదెన్న శక్యమె ? భవానీశంకరా ! సత్ప్రభూ. 26

మ. నెనరుంజూపుచు భక్తులన్మనుచు నీ నీవంటిదేవ్రుండు నెం
దును లేడంచునెఱింగి నేనుమది సంతోషంబుతోఁ గొల్చుచుం
డ నన్నున్ దుస్తరకష్టవారినిధిలోనన్ముంప నాయంబె ? పూ
నిన దీక్షన్ విడనాడవా ? శివ ! భవానీశంకరా ! సత్ప్రభూ. 27

శా. దోసంబేమియొనర్చితో పరమ సాధుశ్రేణిబాధించితో
వాసింగాంచిన నీదుభక్తజనసేవావృత్తులన్మానితో
నా సేమంబులఁ జూడకుందువిఁకనైనన్ నన్ను సంప్రీతితో
నీసాయుజ్యమొసంగి ప్రోవుము భవానీశంకరా ! సత్ప్రభూ. 28

శా. నాచారిత్రముఁజూచినన్ మనములోనన్ జాలివాటిల్లదా ?
నీచిత్రంబు లగోచరంబులు జగన్నిర్ణేతవై ఘోరపా
పాచారంబు లొనర్చువారల కదృష్టాత్ముండవై యుందు వీ
నీచారిత్రము లెన్నశక్యమె ? భవానీశంకరా ! సత్ప్రభూ. 29

శా. అవ్యాజస్థితి నీమహామహిమలన్ ధ్యానింపలేకిట్లు ఘో
రవ్యామోహపయోనిధిన్ మునిఁగి తీరంబుం గనన్ లేక రో
గవ్యాఘ్రంబులచే హరింపఁబడు వీఁకందామనుష్యుండిలన్
నీవ్యాపారము చూడఁజిత్రమె ? భవానీశంకరా ! సత్ప్రభూ. 30

మ. త్రిపురంబుల్ నశియింపఁజేయఁగ మహాధీరత్వముంజూపుచున్
గృపడెందంబునమాని పట్టుదలతోఁ గేరించి శ్రీభూరమా
ధిపసూర్యాదుల నండగాఁగొనిన నీధీరాకృతింజూచి యే
నెపముంబెట్టఁదరంబె ? యేరికి భవానీశంకరా సత్ప్రభూ. 31

మ. తగుమంత్రంబులు లేనిమంత్రినిఁ; బ్రజాదాక్షిణ్యహీనుండునా
జగతీనాథుని; మేలుసేయనిసఖున్; శాంతంబులేనట్టి మా
ని గుణోదారుని; దుష్టబుద్ధినెపుడేనిన్ వీడయు క్తింబగున్
నిగమాంత స్తవనీయవిగ్రహా ! భవానీశంకరా ! సత్ప్రభూ. 32

మ. అలరన్ ముత్యాలుమూటగట్టు భవదీయాకారమున్ లోచనం
బుల దర్శింపఁగ నుండునావొడఁ జేలంబుం బూని నన్నిట్లు బా
ధలు వెట్టం దగవౌనె ? యింకనయినన్ దాక్షిణ్యముంజూపి నీ
నెలవుంజేర్పుము తండ్రి ! వేడెద భవానీశంకరా ! సత్ప్రభూ. 33

మ. నిగమాంతంబులు శాస్త్రముల్ స్మృతులువర్ణింపంగ లేనట్టి నీ
సుగుణశ్రేణుల మానవుండనగునే శోభిల్ల నేరీతిఁ జె
ప్పఁగనేర్తుం ? దుదకెట్టులైన నుతియింపన్ దీక్షతోనుంటి నా
నెగులుంబాపి కృపాత్మఁజూడుము భవానీశంకరా ! సత్ప్రభూ. 34

మ. మలయన్ సద్యశమెట్టులన్ ధరణిజన్మంబెత్తినో తొంటిభ
క్తులు నీరూపముఁగాంచి నిన్ గొల్చి సంతోషాంబుధిందేలి కో
ర్కెల నెల్లంబడయంగఁ గల్గిరనుచుం గూర్మిన్ నినుంగొల్తు నీ
నెలవున్ నాకు నొసంగు మోశివ ! భవానీశంకరా ! సత్ప్రభూ. 35

శా. నీలీలామయమూర్తి వేడుకలతో నిత్యంబు సేవించు భ
క్తాళిం గాచుచు వెంబడింతువని నే నాసక్తితో నిన్ను నీ
లీలన్ గొల్వఁగఁ బూనితిన్ మదిని బాళింజూపి నామీఁద నీ
నేలంజేర్పఁగదయ్య యీశ్వర ! భవానీశంకరా! సత్ప్రభూ. 36

మ. భవదీయాలయగోపురంబునకునై ప్రాల్మాలకే విత్తమొ
కఁడొవడిన్ గూర్పఁగ దాని ముష్కరుల పాల్గావించి పోరాళ్ళఁదే
ర విశేషజ్వరపీడితున్ సలుప ధర్మంబౌనె? నీబోంట్లకి
న్ని విపర్యాసములేలచెప్పుము భవానీశంకరా ! సత్ప్రభూ ! 37

శా. నీ కారుణ్యమునన్ నిరంతరశుభానీకంబు సేకూరు భ
ద్రాకారుండవు నిన్ను నెట్లు నుతిసేయంజాల నన్నింకనో
శ్రీకంఠా ! దయనేలుమయ్య పరులన్ సేవింప నా కేమొదన్
నీకంటెన్ హితుఁడొకఁడుండెనె? భవానీశంకరా ! సత్ప్రభూ. 38

శా. భద్రాకారుఁడవీవు నీమహిమలన్ వర్ణింప శక్యంబె ? నీ
రౌద్రంబుం గని లోకము ల్వణఁకు దుర్వారోగ్రగాంభీర్యశౌ
ర్యోద్రేకంబున మిత్తిఁగూల్చిన మహాయోధుండవై వేడ్కతో
నిద్రింపంగఁ గడంగినావట భవానీశంకరా ! సత్ప్రభూ. 39

శా. కోపంబేటికిఁ దండ్రి ! లోకమున భక్తుల్ వోవుమార్గంబె నీ
దాపుంజేర్చునటంచు నేయెడల నీధ్యానంబులం జేయు నా
పాపం బూడిచి మోక్షమీయ కిటులన్ బాధింపఁగానౌనె ? నే
నీపాదంబులె నమ్మికొల్చెద భవానీశంకరా ! సత్ప్రభూ. 40

మ. ఇదియేమో యనిచూడ కేయెడల వహ్నిం ద్రొక్కినం గాలు న
ల్లెడలో నిన్ను నుతించువారలిలలో నెవ్వారలైనన్ మహా
ముదముం జెంది భవత్పదంబున సుఖంబుల్ గాంచుచుండ్రంచు నె
న్నదనీగొప్పతనంబు నెప్పుడు భవానీశంకరా ! సత్ప్రభూ. 41

మ. తొలఁగెన్ నా జవసత్వముల్ కినుక నాతోఁ బంత మింకేల భ
క్తులలోనన్ నను జేర్చి బ్రోవు మతి సంతోషంబునన్ నీదు మూ
ర్తుల నే సంస్మరియించుచుంటిఁ గరుణాపూర్ణుండవౌ నీవు వ
న్నెల నెన్నందరమౌనె ? నా కిల భవానీశంకరా ! సత్ప్రభూ. 42

శా. కాలుం డుగ్రతరాగ్రహుండగుచు మార్కండేయునిం బట్టనా
భీలాకారముతోడ వచ్చినను సంప్రీతిన్ మృకండ్వాత్మజుం
గేలం గైకొని కాలునిం దటిమి వే కేరించి కేళ్ళుబ్బనా
నీలీలల్ వినుతింపశక్యమె ? భవానీశంకరా ! సత్ప్రభూ. 43

మ. ధరలో నందని మ్రానిపండ్లకొఱకై కాత్మం జింతలం బాయకుం
దురె విజ్ఞానులు; దీని క్రిల్లు తలక్రిందుం గాంచి యజ్ఞుల్ మహా
త్తరకష్టంబులఁ జిక్కి కుందుదురు నీదాసుండనౌ నన్నిఁకన్
నిరపాయంబునఁ బ్రోవుమీశ్వర ! భవానీశంకరా ! సత్ప్రభూ. 44

శా. కర్మాంబుల్విడి మత్తతం బ్రబలు నిష్కాముల్ కృపాహీనులా
దుర్మార్గుల్ కృపణుల్ కృతఘ్ను లతి ఘూర్తుల్ జంతుహింసాకరుల్
ధర్మాకారమహాభవత్పదముఁ బొందంగా నసహ్యుల్ భవ
న్నిర్మాణంబు నుతింప శక్యమె ? భవానీశంకరా ! సత్ప్రభూ. 45

మ. అవనిన్ భక్తులు లోన వేడుకల నష్టైశ్వర్యవంతుండవౌ
భవదీయాంచితకీర్తి నేయెడల సంభావించుచుం ద్రెంచు సం
స్తవముం జేయుచు నీ మహామహిమలన్ జాటింపగా నుంటి లే
ని విచిత్రంబులఁ జూపఁజోకుము భవానీశంకరా ! సత్ప్రభూ. 46

మ. వినుమోస్వామి! శ్రమంబునోర్చి ధనమున్ వెచ్చించి నీయాలయం
బును గట్టించి భవత్ప్రతిష్ఠ నధికామోదంబునన్ లోను తా
ననగాఁ జేసితి నందుకున్ ఫలము సౌఖ్యాధారమౌ మోక్షమున్
నెనరుంజూపి యొసంగుమింతట భవానీశంరా ! సత్ప్రభూ. 47

శా. రుద్రా ! యందనిప్రమానిపండ్లకొాఱ కల్గుంజొచినక్లేయెడ౯
క్షుద్రాత్ముల్ గనలేరు నీప్రకృతి; భక్తుల్ సర్వదా కూర్మి నీ
భద్రాకారముఁజూచుచుం బరమున౯ వర్తింతురంచెంచి నే
నిద్రాదుల్విడి నిన్నుఁగొల్చితి భవానీశంకరా ! సత్ప్రభూ. 48

శా. నీసౌందర్యము నీమహామహిము వర్ణింపంగశక్యంబె ? నా
దోసంబెంచక కూర్మితోమదిని భక్తుండీతడంచు౯ నను౯
నీసూనుంబలెఁ జేరఁదీసి యిటు వర్ణింపంగ లేనట్టియా
నీసాయుజ్యమొసంగి ప్రోవుము భవానీశంకరా ! సత్ప్రభూ. 49

శా. నీకు౯ సేవలొనర్చుచు౯ నిరతము౯ నీచెంతనేయుండి యీ
నీకీర్తింబొగడందలంచితిని కానీ జీవనోపాధియు౯
లేకుండం బచరించి దేశములపాల్సేయంగ నీవెంచితే
నీ కేలోపముఁ జేసియుంటినె ? భవానీశంకరా ! సత్ప్రభూ. 50

శా. నాసంతానము పాడుచేసితివి నీనామస్మృతింబాసితో
నీసేవల్ నెరవేర్చ నన్నిటుల మన్నింపంగరాదా ? మహా
యాసం బేటికి ? నబ్బరాట్పురవిహారా ! సత్కృపాదృష్టితో
నీసాయుజ్యమొసంగిప్రోవుము భవానీశంకరా ! సత్ప్రభూ. 51

మ. అనృతంబాడ ఋణంబుసేయ నెట నన్యద్రవ్యముంగోరఁగా
వున నేనింకనొనర్చినట్టి దురితంబుల్ చెప్పుమోస్వామి ! భ
క్తునిఁగష్టంబులపాలుసేయఁదగునా ? కూర్మిన్ నన్నుఁ మోక్షమొం
దిన ధన్యాత్మునిఁజేసిప్రోవుము భవానీశంకరా ! సత్ప్రభూ. 52

మ. నవకంబంతయుఁ జాఱునీవ్రతమితో నాచేతఁజేయించుకొ
న్న విశేషార్చలకెట్లు నాఋణము పిన్నాణంబుగాఁ దీర్చుకొం
దువు? మోక్షంబునొసంగి తీర్చుకొనుమింకన్ సందియంబున్నె? లే
నివి నేఁగోరిన లాభముండునె ? భవానీశంకరా ! సత్ప్రభూ. 53

మ. తగువిశ్వాసము ప్రీతిసంభరితబాంధవ్యంబునం దుత్తమం
బగు; నారోగ్యము సర్వవస్తువులలో నత్యగ్రగణ్యంబగుఁ
సుగుణౌఘంబులలోన భూతదయ నెంతోఁ బెద్దయౌఁ దోఁచు నా
నిగమాంతంబునుబోలె నేమొడ భవానీశంకరా! సత్ప్రభూ. 54

మ. ఇల సప్తవ్యసనంబులం దగులువా రెందేని నీ ప్రేమ పా
త్రులు కాఁజాల రటంచు లోపల భవద్రూపంబు నేనెంచి వే
డ్కలతో నుండగ నిట్టు కష్టముల పాల్గావింప న్యాయంబె? నీ
నెలవింకన్ దయచేసి ప్రోవుము భవానీశంకరా! సత్ప్రభూ. 55

మ. ధరలో సర్వవినాశ ముత్కట మనస్తాపంబు స్వస్థాన దు
శ్చరితంబుల్ నిజవంచనంబును దిరస్కారం బవాచ్యంబు లం
చు రహిం బల్కుచు నుందు రేమెడలవిజ్ఞుల్; కాన నాకీవెతల్
నెరపం బోకుము తండ్రి! మ్రొక్కెద భవానీశంకరా! సత్ప్రభూ.

మ. పుడమిన్ లోభముచే నిరంతరము వ్యామోహంబువాటిల్లు బెం
డడిఁబోలంగల దానిచే నధిక ఖేదంబబ్బు నేవేళలన్
వడి దానం దగు స్వాశ్రయంబున కహో భంగంబగున్; దానఁబోం
దెడి కష్టంబులఁ జెప్పశక్యమె ? భవానీశంకరా ! సత్ప్రభూ. 57

శా. నీపాదంబులు లోన నమ్మి యెపుడున్ నీ సేవలం జేయుచున్
నాపాపంబు లణంపఁజేసికొని చెందన్ మోక్షసామ్రాజ్యమున్
సోపానంబులు గట్టికొంటి నిఁక దుష్టం జితడం చెంచకా
నీపుణ్యాలయమిచ్చి ప్రోవుము భవానీశంకరా ! సత్ప్రభూ. 58

మ. జనమాన్యున్ సుయశోవిశాలుని నినున్ స్వాంతంబునం దెప్పుడే
మనుజుం డెంచుచునుండునో యతఁడసామాన్య ప్రభావుండనన్
ఘనకైవల్యముఁ జేరి సర్వసుఖముల్ గాంచుంగదా ? యట్టివా
నిని వర్ణింపఁదరంబె ? యేరికి భవానీశంకరా ! సత్ప్రభూ. 59

మ. కృపకుం వారిధివై మహోజ్జ్వల వియత్తేజుండవై సర్వభ
క్తపరాధీనుఁడవై చెలంగుదట నీదాసుండనై నట్టి నా
యపరాధంబులఁగాచి మోక్షమిడుమయ్యా నిన్నిఁకం లోనవే
నెపముల్వెట్టి త్యజింపఁబోకుము భవానీశంకరా! సత్ప్రభూ. 60

మ. చిటికెల్ వ్రేయుటఁగాని యీతఁడు ననుం జింతించునో వీడునో
యెటులం జేయునో నేఁగనుంగొనెదఁగానీయంచు నీవెంచి న
న్నిటులం బాధలువెట్టెదో యయిన నిన్నే కొల్తు నంబ్రోవుమో
నిటలాక్షా! యిది నీకుఁదప్పదు భవానీశంకరా! సత్ప్రభూ. 61

మ. అటవిం దుంపలు కాయలుం జలము లాహారంబుగాఁదోప హృ
త్పుటమందుం నినుఁగొల్చు భక్తజనసందోహంబుఁ గాపాడుచుం
దట యిద్దానికి నామృకండుతనయుం డౌసాక్షి; కాబట్టి య
న్నిటికిం గర్తవు నీవెయౌదువు భవానీశంకరా! సత్ప్రభూ. 62

శా. నాచారిత్రమెఱింగి సర్వమిలలో నన్నిట్లు బాధింప నీ
యాచారంబె ? నిరంతరంబు మదిలో ధ్యానించు భక్తాళి సం
కోచింపంబనియేమి ప్రోవ; నిఁక నాకున్ మార్గముం జూపుచున్
నీచెంతన్ వసియింపఁ జేయుము భవానీశంకరా ! సత్ప్రభూ. 63

శా. చెప్పంజాలరు నీమహామహిమలన్ జెల్వార నింద్రాదు లో
యప్పా ! నిన్ను నతిక్రమింపఁగల దైవాధీశుఁడొక్కండు లే
డిప్పాపాత్ము ననుం గృపామయుఁడవై నీవేళఁ గాపాడుమా
నిప్పంబోలినవాఁడ వీవిల భవానీశంకరా ! సత్ప్రభూ. 64

శా. భోగీశాభరణుండవై యచలరాట్పుత్రిన్ మహాప్రీతిఁ దవ
గ్భాగార్ధంబుననుంచి తాలిచి పినాకంబుం గరంబందు నా
వాగీశాదిబుధేంద్రపూజితపదాబ్జాతుండవై యుండు నా
నీగాంభీర్యము నెన్న శక్యమె భవానీశంకరా ! సత్ప్రభూ. 65

శా. ప్రఖ్యాతిం గని యోగవృత్తిని నిరూ స్వాంతంబునం జూచుచుర్
సౌఖ్యంబందుచునుంద్రు యోగులని నీసాన్నిధ్యముం జేరఁగా
వ్యాఖ్యాతంబగు నీదుమంత్రమెపుడున్ ధ్యానించుచుంటిన్ మదిన్
నీఖ్యాతిం బొగడంగ శక్యమె భవానీశంకరా ! సత్ప్రభూ. 66

మ. ధరనర్థంబు లనిత్యముల్ తనువు లస్థైర్యంబులున్ జీవముల్
బరికింపన్ జలబుద్బుదంబులని చెప్పన్ విజ్ఞులాలించి యి
కృరణిన్ జేయుచునుంటి నీదుజపముల్ గారుణ్యతన్ నీదుమం
దిరమందున్ వసియింపఁ జేయుము భవానీశంకరా ! సత్ప్రభూ. 67

మ. తొలిపాపంబున జన్మమెత్తినను భక్తుల్ నీదునామస్మృతిన్
గల పాపప్రచయం బణంచుకొనుచున్ గైవల్యముం జెంది య
గ్గలపుంగోర్కులఁ బొంది నీవలన నేకాలంబునంగాని వ
న్నెలఁ గాంచంగలవారు మేదిని భవానీశంకరా ! సత్ప్రభూ. 68

మ. అకటా ! నేనిటులింతదాఁక మదినీధ్యానంబు లేకున్నఁ గం
టికి ఱెప్పంబలెఁ బ్రోచినాడవనుచున్ నీదివ్యనామంబె కా
నికదింపన్ మఱి వేఱుసంగతులు నన్ నిక్షేపితుఁగావించి నీ
నికరస్థానమొసంగి ప్రోవుము భవానీశంకరా ! సత్ప్రభూ. 69

మ. మనుజుండేయెడలన్ వివేకమున నీ మాయాప్రపంచంబుఁ దా
సినిమాబొమ్మలరీతి మిథ్యయనుచుం జిత్తంబులోనెంచి స
జ్జనమాన్యున్ సుగుణాంబురాశిఁ గరుణాస్వాంతున్ మహాదేవునిన్
నినుధ్యానింపక మోక్షమొందునె? భవానీశంకరా ! సత్ప్రభూ. 70

మ. నరుఁడీలోకమునుండి పోవుతఱి వెంటం బుణ్యపాపంబులు
ధ్గురతన్ వచ్చునుగాని యేవియును నెందున్ రావటంచాత్మలో
నరయంజాలునెవండు వాఁడొకఁడె ధన్యాత్ముండు; మోక్షానికై
నెఱవౌమార్గము నీదుపూజయె భవానీశంకరా ! సత్ప్రభూ. 71

మ. పురుషార్థంబని నీదుదేవళము నేఁ బోరాడి కట్టించి యం
దరు మెచ్చన్ నిను దాననిల్పితి రవంతైనన్ దయంజూడ కి
క్కరణిన్ బాధలువెట్టుచుంటివిఁక మోక్షంబిచ్చి కాపాడుమా
నిరతంబున్ నినువీడ నేనిల భవానీశంకరా ! సత్ప్రభూ. 72

మ. తరువో పర్వతమో మహాగగనమో ధారాధరవ్రాతమో
దరకాకోదరమ స్తసంభృతసమ స్తక్షోణిసంభారమో
శిరమందుంచినరీతి భారముగఁ దోచెన్ నాకు సంసారమీ
నెటికైలాసమొసంగు మింతట భవానీశంకరా ! సత్ప్రభూ. 73

మ. ధరణిన్ వి త్తవినాశనంబును మనస్తాపంబు మోసంబు మం
దిరచారిత్రపరాభవంబు లెపుడేనిం జెప్పినన్ దేహి తాఁ
బరిహాసాస్పదుఁడౌనటంచు విబుధుల్ భాషించువాక్యంబులన్
స్థిరబుద్ధిం దలపింపఁగావలె భవానీశంకరా ! సత్ప్రభూ. 74

మ. తనువుల్ చూడ నశాశ్వతంబులగు విత్తంబస్థిరంబౌను జీ
వనముల్ జీవనబుద్బుదంబులనుచున్ భావంబులందెంచి స
జ్జనులెల్లప్పుడు సౌఖ్యమబ్బెడిభవత్సాయుజ్యముంగోరుచున్
నినుధ్యానింతురు భక్తవత్సల ! భవానీశంకరా ! సత్ప్రభూ. 75

మ. ప్రియవాక్యంబులతోడి దానమును గర్వింపంగరానట్టియా
నయవిజ్ఞానము శ్లాఘనీయమగు శాంతంబొప్పు శౌర్యంబు ని
ర్దయఁ జూపింపనిత్యాగయుక్తమగువిత్తంబుండడంచున్ బుధుల్
నియతిన్ బల్కిరి రాజశేఖర ! భవానీశంకరా ! సత్ప్రభూ 76

మ. నముగాముల్విడులోభి తాధనికుఁడై నంగాని భోగంబు లొం
దమి నేవేళ దరిద్రతుల్యుఁడగుఁగానన్ వేడ్కతోఁ ద్యాగభో
గములంగూడని విత్తమున్నఫలమే కష్టంబెపో పోయినన్
నిముసంబున్న సుఖంబుగల్గునె ? భవానీశంకరా ! సత్ప్రభూ. 77

మ. మతిమంతుండగు మానవుండెపుడు సన్మార్గంబునన్ దా ధన
ప్రతతిన్ మేదినిఁగూడఁబెట్టుటకు సంపాదింప యత్నంబు చే
యుతఱిన్ లోభగుణంబువీడఁదగు, లేకున్నన్ దగున్ హాని; సూ
నృతమార్గంబుననుండ యుక్తము భవానీశంకరా! సత్ప్రభూ. 78

మ. తనవిత్తంబును లోభి తాఁదినడు లేదా దానముంజేయ డ
ర్థినికాయంబున కాత్మబంధువుల కెందేనిన్ నియోగింప డా
ధనమున్నందున లాభమేమి ? తుదకున్ దైన్యంబగున్ గావునన్
నినుఁజింతించుట మేలు దేహికి భవానీశంకరా! సత్ప్రభూ. 79

మ. సుజనస్నేహము హేమకుంభసమమై చోద్యంబుగావించు దు
ష్టజన స్నేహముగాంచు మృద్ఘటముతో సామ్యంబు; నిద్దాని నెం
చి జనంబేమెడనైన సాధువులతో స్నేహంబుగావించి నీ
నిజవాసంబును జెందఁగావలె భవానీశంకరా! సత్ప్రభూ. 80

శా. ఉర్వీలోభము మోహముం గలుగఁ జేయున్; మోహమున్ దుఃఖముం
బర్వం జేయును; దుఃఖ మగ్నిపగిదిన్ స్వస్థానముం గాల్చు; నీ
సర్వంబున్ విబుధుండెఱింగి మదిమోసంబొంద కాలోభమున్
నిర్వాణంబొనరించునే యెడ భవానీశంకరా! సత్ప్రభూ. 81

శా. శ్వాసంబున్ గనకాసనంబున నిడన్ బంచాస్యగాంభీర్య మె
ద్దానం గల్గునె? క్షుద్రుఁ డట్లధిక విత్తంబున్ సమార్జించినన్
మానంబబ్బునె? మాన్యుఁడే యెడలనైనన్ మోక్షమున్ జెందఁడా
నీనామస్మృతిలేక మేదిని భవానీశంకరా! సత్ప్రభూ. 82

శా. నీకర్పింపని నైభవంబు వసచాంద్రీ వైభవం బంచు నా
నీకల్యాణమహాచరిత్రముల వర్ణింపంగ లేనట్టి జీ
హ్వాకాండంబులు బండలంచు మదిలో ధ్యానించి యీనాసిరుల్
నీకర్పించితి మోక్షమిమ్మిఁక భవానీశంకరా! సత్ప్రభూ. 83

మ॥ అఖిలార్థంబుల నెంచిచూచినను శౌర్యత్యాగశౌచాదులన్
సుఖదుఃఖంబులయందు సామ్యము లటంచుం బెద్దలుం బల్కుచుం
ద్రు ఖలుల్ దీని నెఱుంగలేక మదిలో దుఃఖంబులం గాంచుచున్
నిఖిలేశున్ నినుఁ గానలేరిల భవానీశంకరా ! సత్ప్రభూ. 84

శా. టొంకుం బాపి శిలాంతరాళమున మండూకంబు పోషించుమీ
నాంకారిం గరుణానిధిం బశుపతిన్ ధ్యానింపకా ముక్తి లో
జం కేమాత్రము లేక పొందదనుచున్ శాసించునార్యోక్తులన్
టెంకాయంబలెఁ గైకొనందగు భవానీశంకరా ! సత్ప్రభూ. 85

మ. జనుఁడే వేళల భక్తిమార్గమున దుష్కర్మౌఘముల్ వీడి నీ
ఘనపంచాక్షరి సంస్మరించిన వెసన్ గైలాసముం జెందువాఁ
డని శాస్త్రజ్ఞులు పల్కుమాటలను నేనాలించి లోలోపలన్
నిను సేవించుచునుంటిఁ గావుము భవానీశంకరా ! సత్ప్రభూ. 86

మ. అలదైత్యారిఖగంబుగా నిఖిల భూమ్యాకాశచంద్రాంబుజా
ప్తులర్కస్యందనఛత్రచక్రములుగాఁ దూలించి యామేరువుఁ
విలుగాఁజేసి దహింపఁగాఁ ద్రిపురముల్ వేంచేయు నీరూపముం
దిలకింపం దరమౌనె? యేరికి భవానీశంకరా! సత్ప్రభూ. 87

శా. ఆపద్బాంధవ! భక్తవత్సల! కృపాత్మా! సర్వదుష్టాసుర
వ్యాపారంబులమాన్పి లోకములఁ గావంజాలి ధర్మంబు సం
స్థాపింపంగల యట్టిదేవుఁడవు నీ సాయుజ్యముం గూర్పుమీ
నీ పాదంబుల నాశ్రయించితి భవానీశంకరా! సత్ప్రభూ. 88

మ. ప్రకృతిన్ ధర్మమెఱింగి విత్తమును సంపాదించి దానాదులన్
సుకృతాత్ముండు మహేశ్వరార్పణమటంచుం జేయునెవ్వాఁడు; వా
నికిఁ గైవల్యమొసంగువాఁడవని నే నిన్నిట్లు సేవించు పూ
నికతోనుంటిని నన్ను బ్రోవుము భవానీశంకరా! సత్ప్రభూ. 89

మ. జగడంబేటికిఁదండ్రి నా వెతల నెంచంబోవుమాతల్లియా
నగజాతన్వినుతింప నామెయియినన్ నన్నోమరాదా? ననుం
దెగడన్ సాగె నితండటంచు మదిలో నీవెంచ కెట్లున్ దయన్
నిగమాంతాయన! మోక్షమిమ్మిఁక భవానీశంకరా! సత్ప్రభూ. 90

మ. పగవారైనను శంకరాయని నినున్ భావింప నీ వాత్మలో
వెగటుంగాంచక వారిఁబ్రోతువని నే వీఁకన్ నినుం గొల్చుచుం
టిగదా నన్నిటుసేయఁ బాడియగునే నీవాఁడఁగానా? యిఁకన్
నెగులుంబెట్టక ప్రోవుమొక్కెడ భవానీశంకరా! సత్ప్రభూ. 91

మ. రజతాద్రీశ్వర! భూరిఘోరభవపారావారమున్ దాటి యె
ట్టి జనుండైనను నీదుభక్తితరి పాటింపంగలేకెట్టు లీ
త్రిజగత్సేవ్యభవన్నిశాంతమును బ్రీతింజెంద శక్తుండె? నీ
నిజరూపంబిఁక నైనఁ జూపుము భవానీశంకరా! సత్ప్రభూ. 92

మ. నెనరుంజూపక నీవగోచరుఁడవై నిత్యంబువర్తించినన్
నినుధ్యానింపక భక్తులుందురె? సదా నీసేవయే మోక్ష మి
చ్చునటంచుం గొలువంగఁబూనిన నమున్ జోకన్ విచారించి ప
న్నిన పంతంబునువీడి ప్రోవుము భవానీశంకరా! సత్ప్రభూ. 93

శా. నిన్నుంబోలిన దేవుఁడొక్కఁ డెపుడేనింగానరాడంచు నీ
సన్నాహంబునకుం గడంగితిని మోసంబాయె నా చింత లి
ట్లున్నంగానవు నీకు న్యాయమిదియా నో భక్తులంబ్రోవవా?
నిన్నున్ వీడఁ బరంబొసంగుము భవానీశంకరా! సత్ప్రభూ. 94

మ. కడదాఁకన్ విషయేప్సితోద్ధత మహాగాఢాంధకారంబునం
బడి పాపంబులఁ జేయుచుం దుదకుఁ గైవల్యంబుఁ గానంగనే
రడు జీవుండని నేనెఱింగి నిను సంప్రార్థించెదన్ సౌఖ్యమొం
దెడు నీ లోకమొసంగి ప్రోవుము భవానీశంకరా! సత్ప్రభూ. 95

మ. మును దేవాసురులెల్లరున్ సుధకు నంభోరాశి సంప్రీతిఁ ద్ర
చ్చిన వేళన్ విషముద్భవింప విబుధక్షేమంబు పాటించి దా
నిని వేగంబున మ్రింగియున్ గళమునందే యుంచి ప్రఖ్యాతిఁ జెం
దిన నిన్నెంచఁ దరంబె ? యేరికి భవానీశంకరా ! సత్ప్రభూ. 96

మ. అవివేకంబున నజ్ఞులాత్మల నినున్ ధ్యానించి చూడంగ లే
రు వివేకుల్ కడుభక్తితో నెపుడు నీరూపంబు ధ్యానింతు ర
ట్టి విధానంబున నిన్నుఁ గొల్చితిని నా డెందంబు మోదింప నీ
నివహంబందిఁక నన్ను నిల్పుము భవానీశంకరా ! సత్ప్రభూ. 97

మ. ఘనతం గాంచి జగంబునం జెలఁకువంకం బోయినం దీపుత
గ్గని చందంబున నీదు నామమెటులన్ గాంక్షించి ధ్యానించినన్
మనుజుం బొందు సమస్తసంపదలు ధాన్యంబుల్ సదా కావునన్
నిను వీడం బరమిమ్ము నాకిఁక భవానీశంకరా ! సత్ప్రభూ. 98

మ. జనులెట్లున్న వివేకహీనునివిధిజ్ఞానంబదేవేళ నం
ఘునిచేదీపముబోలె వ్యర్థమని నిన్నుంజూడ నీధ్యానమున్
మనమందున్ విడనాడకుంటి నను సమ్మానించి కైవల్యమొం
దినపుణ్యాత్మునిఁగా నొనర్పుము భవానీశంకరా! సత్ప్రభూ. 99

మ. మమతన్ నేనెదదీక్షఁబూని యిటులన్ మత్తేభశార్దూల వృ
త్తములంగట్టితి మాలనీకొకటి తద్దామంబుఁబేర్మిం గ్రహిం
చి ముదంబందుచు నీపదంబిడి ననున్ జేఁబట్టరమ్మింక నే
నిముసంబైనను వీడ నిన్నెఁద భవానీశంకరా! సత్ప్రభూ. 100

మ. అవనిం గాశ్యపగోత్రజుండ నల జగ్గాంబాబ్బరాజాత్మసం
భవుఁడన్ శ్రీరఘునాథసంజ్ఞుఁడను నీభక్తుండనై యుండు న
న్నవలీలన్ భవదీయపుణ్యతమగేహావాసునిం జేయుమే
నెవముంబెట్టక సత్కృపామతి భవానీశంకరా! సత్ప్రభూ. 101

శ్లో. శ్లోకార్థేన ప్రవక్ష్యామి, యదుక్తం గ్రంథకోటిభిః
నాస్తిపుణ్యం కృపాతుల్యం, పాపం హింసాసమం నహి.

అనేక గ్రంథసముదాయములం దెయ్యది చెప్పఁబడినదో యట్టి విషయ మొకట శ్లోకార్థమునఁ జెప్పెదను. ఏమన దయతో సమానమగు పుణ్యమును, హింసతో సమానమగు పాపమును లేదు. అని పెద్దలవాక్యము.

మఱియు

పరోపకారపరుండయినవానికిఁ బుంఖానుపుంఖంబులుగ సంపదలు సంభవించు. తీర్థస్నానదానజపహోమదేవతార్చనాదులు పరోపకారంబునుం బోలనేరవు.

సీ. పొడిదగ్గు కంఠంబుఁ బొరి పుచ్చకయమున్న
తల ప్రకంపంబు బొందకయమున్న
బొమలుకన్నులమీఁద బొదిలి వ్రాలకమున్న
పొర నేత్రముల కడ్డుబొడకమున్న
శ్రుతిపుటంబులశక్తి సుడిఁగిపోవకమున్న
వళులాననమునఁ బర్వకయమున్న
హృదయంబులోఁజాగ పదనుదప్పకమున్న
గాత్రంబుశిథిలంబు గాకమున్న

పండ్లు వేర్వాసి కదలు చూపకయమున్న
కాకి కడకంటిపై చూపు రాకమున్న
కాలుసేయాడుతఱి యంద కదలవలయుఁ
దీర్ఘసేవకు దేహ మస్థిరముగాన.

—◆ హిత బోధ ◆—

భూలోకంబున జన్మించిన ప్రతిమానవుండును, భగవన్నామముచే దరింపవలయునని పెద్దలు వక్కాణింతురు. ఇట్టి పవిత్రమైన నామోచ్చారణమునకు స్థిరచిత్తముండవలయును. అట్టి స్థిరచిత్తము లేక యెట్టి జపంబులును నెఱవేఱవు. సమస్తశాస్త్రములు సాంగములుగఁ బఠించినను, యజ్ఞాదులొనరించినను, నిత్యనైమిత్తికాది కర్మములు విధిప్రకారముగ ననుష్ఠించినను, సమస్తదేవతలఁ బూజించినను, సర్వతీర్థములు సేవించినను, జపమాలలు ద్రిప్పినను, మనోవేగముఁ దగ్గించుకొనుటకుగాని, వేఱుగాదు. అట్టి మనోవేగముఁ దగ్గించుకొనుటకు సులభోపాయమగు ముఖ్యసూత్ర మొండు విన్నవించెద. తనదృష్టిని శ్వాసమందుంచి శ్వాసము లోనికిం బోవునపుడు దానితోఁబాటు "సో" అనియు, దానిని వదలునపుడు "హం" అనియుఁ బనిలేనప్పుడెల్ల జపించుచురా నీజన్మమునందుఁగొంతఫలమిచ్చి యుత్తర జన్మమునంగూడ నిదియేమార్గదర్శియై కోరికల నశింపంజేసి జన్మ

సాక్షాత్కారమునకు మార్గమేర్పడునను. "సోఽహం" మను మంత్రమును జపించినయెడల చిత్తస్థైర్యమేర్పడి తన్నుఁ దామఱచి సమాధివిశ్రాంతినిఁ బొందవచ్చును. "సోఽహం" మనఁగా నేనే బ్రహ్మమని యర్థము. "శివోఽహం" మనగా నేనే శివుఁడనని యర్థము. ఈ రెంటికి భావమొక్కటియే యగుటంబట్టి దీనికి శివరాజయోగంబని పేరు. మనస్సును పరుగిడఁగుండఁ జేయుటకు, "సోఽహం" మను మంత్రము, రామమంత్రముదప్పఁ దక్కిన వెవ్వియును సమర్థములైనవి కాఁజాలవు. రామమంత్రముఁ గూడ "సోఽహం" మను మంత్రమువలె జపించవలెను. ఈ మంత్రమును సర్వకాలములందును జపించుచుండిన మానవుఁడు జన్మరహితుండు కాఁగలఁడు. దీనినే యాత్మధ్యానమందురు.

శ్లో. దేహో దేవాలయః ప్రోక్తో, జీవోదేవస్సనాతనః
త్యజేదజ్ఞాననిర్మాల్యం "సోఽహం" భావేన పూజయేత్. (ఇతి శ్రుతిః)

ఇట్లు,
మాదిరాజు రఘునాధరావు.

భవానీ శంకర శతకము